


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -137-

(14' మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఒక యువకుడు** ఒక యువతిని ప్రేమించి, పెళ్ళి విషయం ఆ పిల్ల తండ్రితో సంప్రతించడానికి వచ్చాడుట. ఆ తండ్రి కుర్రాణ్ణి అడిగాడుట "నువ్వు ఏం చేస్తున్నావు?" అని.

దానికి ఆ కుర్రవాడిలా అన్నాడుట "ప్రస్తుతం ఏమీ చెయ్యడంలేదుగాని చెయ్యాలంటే ఏదైనా చెయ్యగలను. అది అవసరాన్ని బట్టీ వుంటుంది" అన్నాడుట.

"ఆ సోదంతా దేనికయ్యా? ఏం చెయ్యగలవో చెప్పు?" అని ఆ గృహస్థు అడిగాడుట.

ఆ యువకుడు వెంటనే అన్నాడుట "పొడుంకాయతో బాంబు తయారు చెయ్యగలను. సీసాలో బేతాళుణ్ణి బిగించగలను" అని.

"నీ ముఖం నువ్వేం చెయ్యగలవు? గారడీ ఏమన్నా నేర్చుకున్నావా?" అని గృహస్తు ప్రశ్న.

"గారడీ అంటారేమిటి? నాకున్న సహజ ప్రతిభను గురించి చెపుతున్నాను. నాకు తెలియని విద్యలేదు. శాస్త్రాలన్నీ చదివాను. నవయుగ పౌరుణ్ణి మళ్ళీ మాట్లాడితే వీరుణ్ణి" అన్నాడట ఆ యువకుడు.

"వీరుడవని తెలుస్తూనే వుంది. నీ వీరత్వం ఆడపిల్లల్ని మోసం చెయ్యడంలో బాగా పనికివస్తోంది. ఇంతా చేస్తే ఆ ప్రేమించిన పిల్లకు అన్నం పెట్టగలవా?" అని ఆయన మరో ప్రశ్న వేశాడుట.

"అన్నానికేం కొదవండీ. అన్నం పెట్టడానికి డబ్బు కావాలి. ఆ మాట నిజమే. కానీ ఈ రోజుల్లో డబ్బు సంపాదించడం కష్టమండీ? దానికి కష్టపడటమొక్కటే మార్గం కాదు ఈ రోజుల్లో. టోకరా వుంది చూశారూ. అది టోకు వ్యాపారం లాంటిది. మోసం వుంది చూశారూ అది మంచి కమీషన్ వ్యాపారంలాటిది. అట్టహాసం చూశారూ అది ఆటోమాటిక్ ప్రాఫిట్ లాటిది. అన్నీ కాకపోతే విరాళాలు ప్రోగుచేయడం చూశారూ. అది ఘరానాగా నజరానాలు స్వీకరించడంలాటిది.

"ఇన్ని విద్యలు దగ్గర వుండగా మీ అమ్మాయికి రోజుకో పట్టెడు అన్నం పెట్టలేకపోతానా? అంతగా వండుకోడానికి తీరుబడి లేకపోతే రెండు రొట్టెలు పెట్టి, ఇంత ఓవల్టిన్ త్రాగించలేకపోతానా? మీ అమ్మాయి కడుపు నింపడం మనస్సు నింపడం అంత లెక్కలో సంగతి కాదు. కనుక మీరు కాళ్ళు కడిగి నాకు సమర్పించడం శాంతియుత పరిష్కారమవుతుంది. కాదంటారా? ఏదో ఒక ఆధునిక కథావస్తుగా మారిపోతుంది బాగా ఆలోచించుకోండి. ఎలా అయినా నాకేం భయంలేదు" అన్నాడట ఆ నవయుగ వీరుడు.

ఇలాటి ఆశ్చర్యకరమైన ఇతివృత్తాలెన్నో వినిపిస్తున్నాయి ఈ రోజుల్లో. ఏ యువకుణ్ణి గురించి చెప్పవలసివచ్చినా "ఆస్థిపాస్తులకేంగానివ్వండి, అఖండమైన తెలివితేటలున్నాయి. ప్రపంచంలో తల ఎత్తుకుని తిరగ్గలడు, పదిమందిని పోషించగలడు" అని చెప్పడం మామూలైపోయింది.

పెరిగి పెద్దవాడైన తర్వాత ఏ పనిలోనూ తలదూర్చకుండా విచ్చలవిడిగా తిరుగుతున్న ఓ యువకుణ్ణి గురించి తండ్రి ఇలా చెప్పాడు "మా వాడికి అంతులేని తెలివి తేటలు ఉన్నాయి. కాని వాటిని ఎలా ఉపయోగించాలో తెలియక అలా తిరుగుతున్నాడు. ఆ తెలివితేటలనే మహా ప్రవాహానికి డామ్ కట్టాలి. అప్పుడేవో రెండు ముఖ్యమైన పనులు కల్పించి వాటిని కుడి కాల్వ, ఎడమ కాల్వగా చేసి నీరు వదలాలి. అప్పుడు వాడు మా కుటుంబానికే కాదు. ఆంధ్రదేశానికే ఎంతో ఉపయోగపడతాడు" అని.

పాపం. ఆయనగారికి కొడుకు తెలివితేటలమీద అంత అభిమానం వుంది. అసలు చాలామంది తండ్రులు కొడుకుల తెలివి తేటలు చూచి "వీడికిన్ని తెలివితేటలెలా వచ్చాయో? తలచుకుంటే విచిత్రంగా వుంది వాడితో పోల్చుకుంటే నా తెలివి తేటలు ఎన్నోవంతు? నిజానికి నాకే కాదు మా వంశంలోనే ఇలాటి తెలివితేటలు లేవు. వీడికెలా వచ్చాయో, వరంలాగా వచ్చాయి" అని ఉబలాటపడుతూ వుంటారు.

సహజంగా మానవుడికి ఈనాడు పుట్టుకతో వచ్చే తెలివితేటలు కాక, పదవుల్లో నుంచి, సొమ్ములోనుంచి అంతులేని తెలివితేటలు పుట్టుకొస్తున్నాయి. "కుర్చీ తెలివితేటలని" క్రొత్తగా ఒక రకం బయలుదేరినాయి. నిన్నటి దినం మాసిపోయిన సున్నంలాటి ముఖంతో ఊరంతా తిరిగేవాడు ఏదో ఒక కుర్చీలో చేరగానే అపర బృహస్పతిగా మారిపోతున్నాడు.

కాలాన్ని గురించి మాట్లాడతాడు. కళల్ని గురించి మాట్లాడతాడు. రాజకీయాలను వల్లించి, ప్రగతికి అవసరమైన మార్పులు సూచిస్తాడు. అన్నిటికీ మించి, అతగాణ్ణి అదివరకు ఎరుగున్న వాళ్ళదగ్గిర కూడా క్రొత్తరకం పోజులు పెడతాడు. తన ముఖంలో క్రొత్త రకం రోజాలు వికసిస్తున్నాయని తన మనస్సులో తెలివితేటల పేరిటి దొంతర మల్లెలు విరబూస్తున్నాయని ఎంతో ముచ్చటపడతాడు.

జీడీలకు నువ్వు పప్పు అద్దినట్లు తను మాట్లాడే ప్రతి మాటకూ, తెలివి తేటల్ని అద్దాలని ప్రయత్నిస్తూ వుంటాడు. 'ఈ 'పప్పు' ఆ కుర్చీ కింద డబ్బాలో పోసి వుంటుంది. గుప్పెడు గుప్పెడు తీసి వాడుకుంటూ వుంటాడు. తనకు ఏ విషయం తెలియదని అంగీకరించడు. గట్టిగా తెలియదని తట్టిన విషయాలు వస్తే "అది అంతే... వివరంగా చెప్పే వ్యవధి నాకు లేదు. వెయ్యి సమస్యలు కాని అది మాత్రం అంతే" అని గట్టిగా అరవడం అలవరచుకుంటాడు.

ఇవి కుర్చీ తెలివితేటలు, ఏ కుర్చీకి తగిన తెలివితేటలు దాంట్లో వుంటాయి. మరి అలాటి కుర్చీ తెలివితేటలకు ఇవతల వాళ్ళు మూర్ఛపోవడం కన్న చేసేదేం వుంటుంది?

కొందరికి బ్యాంకు బాలెన్సులో నుంచి అద్భుతమైన తెలివితేటలు పుట్టుకు వస్తాయి. కాళుడు కాళిదాసుగా మారిపోయినట్లు అమాంతంగా మహాకవి అయిపోతూ వుంటారు ధనవంతులు.

"ఆ విషయం నాకు తెలియదనుకుంటున్నారా? మీ కంటే బాగా తెలుసు. కావాలంటే చెపుతా వినండి" అని ప్రారంభించి ఆ విషయంతో సంబంధం వున్నా లేకపోయినా విచ్చలవిడిగా మాట్లాడేస్తాడు ఒక అరగంటదాకా. ఆ ధనవంతుడితో ఏదో పనివున్న వాళ్ళకి ఆ మాటలు ఎంతో బాగుంటాయి.

"అబ్బా ఎంత చక్కగా చెప్పాడు? అసలంత మంచి ఆలోచన ఎలా తట్టిందో ఆయనకు?" అని అవసరంకొద్దీ అమందానంద కందకళిత హృదయారవిందులవుతూ వుంటారు ఆ తరగతి నరులు.

సొమ్ము వుంటే తెలివితేటలు ఆకాశగంగలా ఉరుకుతాయి. ఎంతవాడయినా కావచ్చు. డబ్బుంటే మేనేజింగ్ డైరెక్టరు కావచ్చు. ఎలాటి కంపెనీకైనా సరే. ఆ సంస్థ యాటమిక్ ఎనర్జీకి చెందింది కావచ్చు. ఆటో మెకాన్సికు చెందిందయినా కావచ్చు. ఆ వ్యక్తి దస్కతు చేసి క్రింద "మేడై" అని వ్రాసుకోవడానికి ఏం అభ్యంతరం వుండదు.

డబ్బుంటే ఎన్నన్నా కావచ్చు. ఎన్ని తెలివితేటలైనా సంపాదించవచ్చు. ఊరికినే వూరిపోతున్న తెలివితేటలు, డబ్బూ, పదవీ వుంటే వరదలాగా వచ్చి పడటంలో ఆశ్చర్యమేం వుంది?

Post your comments